క్లుప్తంగా

సమస్యలు పరిష్కరించాలి



మాట్లాడుతున్న ఏఐటీయూసీ నాయకులు

సిరిసిల్ల అర్బన్: వేములవాడ దేవస్థాన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన కార్యదర్శి కడారి రాములు అన్నారు. ఆదివారం పట్టణంలోని ఏఐటీయూసీ కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. కార్మికులందరినీ కాంట్రాక్ట్ బేసిక్‌లో కాకుండా దేవస్థాన ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. పని భద్రత, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలన్నారు. కనీస వేతనం రూ.26,900 ఇచ్చి, ప్రమాద బీమా సౌకర్యం కల్పించాలన్నారు. ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు అజ్జ వేణు, పెంట ప్రవీణ్, రమేశ్, తదితరులు పాల్గొన్నారు.

ఏజీపీకి సన్మానం



ఏజీపీని సన్మానిస్తున్న నాయకులు

గంభీరావుపేట: ప్రముఖ న్యాయవాది పసుల కృష్ణ ఏజీపీగా నూతనంగా బాధ్యతలు స్వీకరించిన సందర్భంగా మండల గౌడసంఘం నాయకులు ఆదివారం ఆయనను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో గౌడ సంఘం మండల అధ్యక్షుడు కార్తీక్ గౌడ్, నాయకులు నారాయణగౌడ్, దత్తాద్రి గౌడ్, పందిర్ల శ్రీనివాస్‌గౌడ్, అంజాగౌడ్, మహేశ్, తిరుపతి, నరేందర్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

మూఢ నమ్మకాలు వీడాలి



మాట్లాడుతున్న ఎస్సై శ్రీకాంత్‌గౌడ్

ఇల్లంతకుంట: ప్రజలు మూఢ నమ్మకాలను వీడాలని ఎస్సై శ్రీకాంత్ గౌడ్ అన్నారు. ఆదివారం మండలంలోని గొల్లపల్లి గ్రామంలో మీకోసం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ... యువకులు సైబర్ నేరాలపై అప్రమత్తంగా ఉండాలని, గంజాయి, మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలన్నారు. ట్రాఫిక్ నిబంధనలు, డయల్ 100పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో గ్రామస్తులు, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

కళాకారులను ఆదుకోవాలి



మాట్లాడుతున్న కళాకారులు

బోయినపల్లి: తెలంగాణ ఉద్యమ సమయంలో వివిధ కళారూపాల ద్వారా పాలు పంచుకున్న ఉద్యమ కళాకారులను ప్రభుత్వం ఆదుకోవాలని మండల ఉద్యమ కళాకారులు పేర్కొన్నారు. మండలకేంద్రంలో ఆదివారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. పదేళ్ల బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కళాకారులకు ఎలాంటి న్యాయం జరగలేదని వాపోయారు. సీఎం రేవంత్‌రెడ్డి తెలంగాణ ఉద్యమ కళాకారులను ఆదుకోవాలని వారు విజ్ఞప్తి చేశారు. ఉద్యమ కళాకారుల సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కనపర్తి హన్మాండ్లు, మండల కమిటీ అధ్యక్షుడు మొగులోజి లక్ష్మీరాజం, మండల కార్యదర్శి బిల్ల వెంకటనర్సయ్య, సభ్యులు బిల్ల శంకర్, సావనపెల్లి సత్యనారాయణ, బిల్ల కమలాకర్, మొగులోజి రమేశ్, మొగులోజి ఆంజనేయులు తదితరులున్నారు.

హామీలు నెరవేర్చాలి

ఇల్లంతకుంట: ప్రభుత్వం ఎన్నికల సమయంలో తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని మండల ఉద్యమకారుల ఫోరం అధ్యక్షుడు భట్టి చంద్రమౌళి అన్నారు. ఆదివారం మండలకేంద్రంలోని బస్టాండ్ ఆవరణలో మండల ఉద్యమకారుల ఫోరం సభ్యుల సమావేశం నిర్వహించారు. ప్రతి సభ్యుడికి 250 గజాల ఇళ్లస్థలం, పింఛన్ అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో సభ్యులు బాలయ్య, నారాయణ శ్రీనివాసరెడ్డి ,నాగరాజు, ప్రభాకర్ చారి, తదితరులు పాల్గొన్నారు.

కమిటీ ఎన్నిక

వేములవాడరూరల్: వేములవాడ ప్రైవేట్ ల్యాబ్ టెక్నీషియన్స్ అసోసియేషన్ సమావేశం ఆదివారం జరిగింది. ఈ సందర్భంగా కమిటీ సభ్యులను ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడుగా సగ్గు శేఖర్, అధ్యక్షుడిగా సూగూరి ప్రభాకర్, ప్రధాన కార్యదర్శిగా గొస్కుల నర్సయ్య, జాయింట్ సెక్రెటరీగా జోగం శేఖర్, ప్రచార కార్యదర్శిగా మల్యాల సుగుణాకర్, క్యాషియర్‌గా రాజేశ్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారిని పలువురు అభినందించారు.

పెండింగ్ బిల్లులు చెల్లించాలి

వీర్నపల్లి: డీఏ, పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి తిరుపతి జాదవ్ అన్నారు. మండలకేంద్రంలో ఆదివారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. అధికారంలోకి రాగానే పెండింగ్ బిల్లులు విడుదల చేస్తామని, సీపీఎస్ రద్దుచేసి పాత పెన్షన్ పునరుద్ధరిస్తామని కాంగ్రెస్ పార్టీ మేనిఫెస్టోలో పేర్కొందన్నారు.

గిరిపుత్రులకు కార్పొరేట్ వైద్యం

- పీహెచ్‌సీని సీహెచ్‌సీగా అప్‌గ్రేడ్
- అందుబాటులోకి జనరల్ ఫిజీషియన్ సేవలు
- నెలకు 3వేలకు పైగా మందికి వైద్యసేవలు
- హర్షంవ్యక్తంచేస్తున్న గిరిజనులు



ఎల్లారెడ్డిపేటలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం

ఎల్లారెడ్డిపేట: గిరిజనులు, పేదప్రజలు కార్పొరేట్ స్థాయి వైద్యం అందక ఆకుపసర్లు, ఆర్ఎంపీలతోనే వైద్యం చేయించుకొని ప్రాణాల మీదకు తెచ్చుకునేవారు. ప్రైవేట్ ఆస్పత్రుల్లో రూ.లక్షలాది రూపాయలు వెచ్చించి ప్రాణాలు కాపాడుకునేవారు. ఇక్కడి పేదల దీన పరిస్థితిని తెలుసుకొని అప్పటి మంత్రి కేటీఆర్ ఎల్లారెడ్డిపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కమ్యూనిటీ ఆరోగ్య కేంద్రంగా మార్చారు. జిల్లాలో ఇప్పటివరకు రెండు కమ్యూనిటీ హెల్త్ కేంద్రాలుండగా ఎల్లారెడ్డిపేటతో ఆ సంఖ్య మూడుకు చేరింది. సీహెచ్‌సీగా అప్‌గ్రేడ్ కావడంతో ఒక ఫిజీషియన్‌తో పాటు మహిళా వైద్యురాలు, మరో వైద్యుడు అందుబాటులోకి వచ్చారు. దీంతో నెలలో 3వేల మందికి వివిధ వైద్యసేవలు అందిస్తున్నారు. సాధారణ ప్రసవాల సంఖ్య పెంచి కార్పొరేట్ ఆస్పత్రులకు దీటుగా వైద్యం అందిస్తున్నారు. ఆరునెలల్లో ప్రాథమిక ఆరోగ్యకేంద్రం పరిధిలో 23కుపైగా సాధారణ ప్రసవాలు చేసి జిల్లాస్థాయిలో ప్రథమ స్థానంలో పీహెచ్‌సీని నిలబెట్టారు.

కార్పొరేట్ వైద్యం

రాష్ట్రస్థాయిలోనే హెల్త్ ప్రొఫైల్‌లో మండలంలోని హరిదాస్‌నగర్‌ను ప్రభుత్వం పైలెట్ ప్రాజెక్టుగా గుర్తించి గ్రామంలో ఇంటింటా నుంచి రక్త నమూనాలు సేకరించారు. ఉమ్మడి మండలవ్యాప్తంగా 60 రకాల పరీక్షలు నిర్వహించి ఫలితాల ఆధారంగా వైద్యసేవలు అందిస్తున్నారు. ఎన్‌పీడీ కింద థైరాయిడ్, షుగర్, బీపీ, లీవర్, కిడ్నీ, రక్తహీనత లాంటి అసంక్రమిత వ్యాధుల తీవ్రతను గుర్తించి వారికి ఆరోగ్య కేంద్రంలోనే కార్పొరేట్ స్థాయి వైద్యం అందిస్తున్నారు. ట్యాబ్‌ల్లో రోగుల ఆరోగ్య పరిస్థితి వివరాలను ఎప్పటికప్పుడు సిబ్బంది పొందుపరుస్తున్నారు. ప్రతినెలా సుమారు 3వేల మందికి వివిధ సేవలు అందిస్తున్నారు. ఉమ్మడి మండలంలో 1,510 మంది బీపీ, 843 మంది మధుమేహం, 62 మంది క్యాన్సర్, వివిధ వ్యాధులతో బాధపడుతున్నారు. వారికి నెలనెలా ఇంటికెళ్లి పరీక్షలు చేసి ముందులు అందజేస్తున్నారు.

జిల్లాలోని ఆస్పత్రుల వివరాలు

ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు	13
కమ్యూనిటీ హెల్త్ కేంద్రాలు	03
24 గంటలు పనిచేసే ఆరోగ్య కేంద్రాలు	07
ఆరోగ్య ఉపకేంద్రాలు	59

నూతన భవనానికి ప్రతిపాదనలు..

ఆరోగ్యకేంద్రాన్ని సీహెచ్‌సీగా అప్‌గ్రేడ్ చేయగా కేంద్రానికి నూతన భవనం నిర్మించేందుకు ప్రతిపాదనలు పంపారు. కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా, జిల్లా వైద్యాధికారి వసంత్‌రావు చొరవతో పలు ఆస్పత్రుల నుంచి అవసరమైన మందులు తెప్పించి రోగులకు అందిస్తున్నారు. రెండెకరాల స్థలం గుర్తించే పనిలో రెవెన్యూ అధికారులు నిమగ్నమయ్యారు. కమ్యూనిటీ హెల్త్ కేంద్రం ఈప్రాంతంలో ఏర్పాటుకావడంతో గిరిజనులు, పేదలు హర్షంవ్యక్తంచేస్తున్నారు. సొంతభవనం, పూర్తిస్థాయి వైద్యసిబ్బంది, ఈ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్యం అందేలా విప్ ఆది శ్రీనివాస్, నియోజకవర్గం ఇన్‌చార్జి కేకే మహేందర్ రెడ్డి కృషిచేయాలని జిల్లాప్రజలు కోరుతున్నారు.

అందుబాటులో వైద్య సేవలు



ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని కమ్యూనిటీ ఆరోగ్యకేంద్రంగా మార్చడం పేదల అదృష్టం. ఇంతకాలం అన్ని రకాల వైద్య సేవలందక రూ.లక్షలాది రూపాయలు వెచ్చించి ప్రైవేట్ ఆస్పత్రుల చుట్టూ తిరిగాం. ఇప్పుడు అందుబాటులోనే అన్ని వైద్యసేవలు అందిస్తున్నారు.

– ఊసి లక్ష్మి, ఎల్లారెడ్డిపేట

ఇంటింటా వివరాలు సేకరణ



అసంక్రమిత వ్యాధులను గుర్తించేందుకు ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నాం. టీబీ, కిడ్నీ, షుగర్, బీపీతో బాధపడుతున్న వారి వద్దకే వెళ్లి రక్త నమూనాలను సేకరించి మందులు అందిస్తున్నాం. సీహెచ్‌సీగా మారడంతో పలువైద్యసేవలు అందుబాటులోకి రానున్నాయి.

– జ్యోతి, ఆశాకార్యకర్త, నారాయణపూర్

అన్ని వ్యాధులకూ చికిత్స



ఆరోగ్య కేంద్రాన్ని కమ్యూనిటీ హెల్త్ కేంద్రంగా అప్‌గ్రేడ్ చేయడంతో ఒక ఫిజీషియన్ అందుబాటులోకి వచ్చారు. అన్ని వ్యాధులకు చికిత్స అందిస్తున్నాం. నూతన భవనం కోసం రెండెకరాల స్థల సేకరణ కోసం రెవెన్యూ అధికారులు పరిశీలనలో ఉన్నారు.

– ప్రవంతిరెడ్డి, మండల వైద్యాధికారి

దళారులను నమ్మి మోసపోవద్దు



కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఏఎంసీ చైర్‌పర్సన్ విజయ

గంభీరావుపేట: రైతులు దళారులను నమ్మి మోసపోవద్దని, కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించి మద్దతు ధర పొందాలని మండల వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ కొమిరిశెట్టి విజయ అన్నారు. మండలంలోని గోరింటాలలో సింగిల్‌విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆదివారం ప్రారంభించారు. కార్యక్రమంలో సింగిల్‌విండో వైస్ చైర్మన్ రామానుజాగౌడ్, సెస్ డైరెక్టర్ నారాయణరావు, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్శ హన్మండ్లు, ఏఎంసీ వైస్ చైర్మన్ అంజిరెడ్డి, సింగిల్‌విండో డైరెక్టర్ రాజవీర్, డైరెక్టర్లు, నాయకులు రాజిరెడ్డి, పిట్ల వెంకటి, లక్ష్మణ్, కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి మూల రాంచంద్రారెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

మంత్రి పొన్నంను కలిసిన చక్రధర్ రెడ్డి

ముస్తాబాద్: బీసీశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్‌ను హైదరాబాద్‌లో ఆదివారం కలిసినట్లు కాంగ్రెస్ పార్లమెంట్ ఎన్నికల కోకన్వీనర్ కనమేని చక్రధర్ రెడ్డి తెలిపారు. మండల అభివృద్ధి పనులపై చర్చించామన్నారు. నూతనంగా బాధ్యతలు చేపట్టిన ఏఎంసీ పాలకవర్గాల సమావేశాలకు హాజరు కావాలని మంత్రిని కోరామన్నారు. త్వరలోనే సిరిసిల్ల పర్యటనకు రానున్నట్లు మంత్రి తెలిపారన్నారు.

చికిత్స పొందుతూ పాస్టర్ మృతి

కోనరావుపేట : నిమ్మపల్లి గుడ్ న్యూస్ బాప్టిస్ట్ చర్చి పాస్టర్ రెవ.బాడిగ సోమయ్య చికిత్స పొందుతూ మృతిచెందారు. వివరాల్లోకి వెళ్తే.. ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సోమయ్య 50 ఏళ్ల క్రితం నిమ్మపల్లికి వచ్చారు. ఇక్కడి ప్రజలను శాంతియుత మార్గంలో నడిపించడానికి కృషిచేశారు. కాగా, ఇటీవల చర్చిలో జారిపడిన సోమయ్య హైదరాబాద్‌లోని ఓ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆదివారం చనిపోయారు. పాస్టర్‌గా ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో ఆయన మంచి పేరు తెచ్చుకున్నారు. ఆయన మృతికి పలువురు రాజకీయ నాయకులు, సామాజికవేత్తలు సంతాపం తెలిపారు. సోమయ్యకు భార్య జయలక్ష్మి, ఇద్దరు కూతుళ్లు, కుమారుడు ఉన్నారు.

కాంగ్రెస్‌లో పలువురి చేరిక



కాంగ్రెస్‌లో చేరిన నాయకులు

వేములవాడ అర్బన్ : వేములవాడ రూరల్ మండలం బొల్లారంకు చెందిన బీజేపీ, బీఆర్ఎస్ నుంచి సుమారు 50 మంది ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ సమక్షంలో ఆదివారం కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువా కప్పి పార్టీలోకి ప్రభుత్వ విప్ ఆహ్వానించారు.

రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపిక



రుచిత్‌రెడ్డి

ఇల్లంతకుంట: మండలంలోని గాలిపల్లి జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలోని ఎ.రుచిత్‌రెడ్డి అనే విద్యార్థి రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు హెచ్ఎం పావని తెలిపారు. రుచితరెడ్డి ఎస్‌జీఎఫ్ అండర్ –17లో రాష్ట్రస్థాయి వాలీబాల్ పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు.

అక్రమంగా మట్టి తరలిస్తే చర్యలు

వేములవాడఅర్బన్: వేములవాడ మండలం అగ్రహారం శివారులో మట్టి తరలిస్తున్నారన్న సమాచారంతో వేములవాడ తహసీల్దార్ మహేశ్ కుమార్ రెండు టిప్పర్లు, జేసీబీ పట్టుకొని వేములవాడ ఆర్టీసీ డిపోకు తరలించినట్లు తెలిపారు. అగ్రహారం గుట్టల వద్ద 144 సెక్షన్ అమలులో ఉందని, అక్రమంగా మట్టి తరలిస్తే చర్యలు ఉంటాయన్నారు.

పేరుకే 'ఉన్నతం..

- ఎనిమిది తరగతులు.. ముగ్గురే ఉపాధ్యాయులు
- నర్మాల ప్రాథమికోన్నత పాఠశాలలో ఐదు పోస్టులు ఖాళీ



నర్మాల ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాల

గంభీరావుపేట: మండలంలోని నర్మాల ప్రభుత్వ ప్రాథమికోన్నత పాఠశాలలో టీచర్ల కొరత నెలకొంది. ఒకటి నుంచి ఎనిమిదో తరగతి వరకు పాఠశాలలో విద్యాబోధన కొనసాగుతోంది. ప్రస్తుతం పాఠశాలలో ముగ్గురే ఉపాధ్యాయులు పనిచేస్తున్నారు. నాలుగు స్కూల్ అసిస్టెంట్లు, నాలుగు ఎస్జీటీ పోస్టులు ఉన్నాయి. కానీ ఒక ఎస్జీటీ, ఇద్దరు స్కూల్ అసిస్టెంట్లు సోషల్ స్టడీస్, బయోలాజికల్ సైన్స్ ఉపాధ్యాయులు మాత్రమే ఉన్నారు. స్కూల్ అసిస్టెంట్ హిందీ, ఇంగ్లిష్, మూడు ఎస్జీటీ పోస్టులు ఖాళీగా ఉన్నాయి. మండలంలో రెండు మాత్రమే ప్రాథమి కోన్నత పాఠశాలలు ఉన్నాయి. అందులో నర్మాల ఒకటి. ఇప్పటికే ప్రభుత్వ పాఠశాలలకు తమ పిల్లలను పంపించేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపడం లేదు. ఆపై టీచర్లు లేని సర్కారు బడికి పిల్లలను ఎలా పంపిస్తామని తల్లిదండ్రులు విముఖత చూపుతున్నారు. ఈ విద్యాసంవత్సరం పాఠశాలలో 51 మంది చదువుతున్నారు. ముగ్గురు ఉపాధ్యాయులు 8 తరగతులకు బోధించడంతో విద్యార్థులకు ఏ అర్థమవుతుందని పలువురు ప్రశ్నిస్తున్నారు. నర్మాల నుంచి వందమందికి పైగా విద్యార్థులు ప్రైవేట్ బాటలో ఉన్నారు. విద్యాశాఖ అధికారులు ప్రత్యేక చొరవ తీసుకొని టీచర్ పోస్టులు భర్తీ చేస్తే పాఠశాల బలోపేతమయ్యే అవకాశం ఉందని గ్రామస్తులు కోరుతున్నారు. డీఎస్సీతోనైనా ఉపాధ్యాయులు వస్తారని భావించిన తల్లిదండ్రులకు నిరాశే మిగిలింది.

పోస్టులు భర్తీ చేయాలి



నర్మాల బడిలో ఖాళీగా ఉన్న టీచర్ పోస్టులను విద్యాశాఖ అధికారులు వెంటనే భర్తీ చేయాలి. బడిని బలోపేతం చేయడానికి మేము ముందుంటాం. ముగ్గురు ఉపాధ్యాయులు ఎనిమిది తరగతులకు ఎలా బోధిస్తారో తెలియడం లేదు.

– రాజబోయిన అంజనేయులు, గ్రామస్తుడు

అధికారులకు నివేదించాం



నర్మాల పాఠశాలలో ఖాళీగా ఉన్న పోస్టుల వివరాలను ఉన్నతాధికారులకు నివేదించాం. విద్యార్థుల సంఖ్య పెంచేందుకు కృషి చేస్తాం. విద్యార్థుల చదువులో రాణించేలా చర్యలు తీసుకుంటున్నాం. పాఠశాలలో ముగ్గురం పనిచేస్తున్నాం. – దోసల శ్రీనివాస్, ప్రధానోపాధ్యాయుడు, నర్మాల యూపీఎస్



ముస్తాబాద్: ముస్తాబాద్ డబుల్‌బెడ్ రూం ఇళ్ల సముదాయం ఆవరణ చెత్తమయంగా మారింది. కేసీఆర్‌నగర్, ఇందిరమ్మ కాలనీకి చెందిన ప్రజలు ఇలా ఇష్టారాజ్యంగా చెత్తను పారవేస్తున్నారు. దారి పక్కన చెత్త వేయడంతో దుర్గంధం వ్యాపిస్తోంది. దోమలు వృద్ధిచెంది రోగాలబారిన పడుతున్నామని కాలనీవాసులు వాపోతున్నారు. కేసీఆర్‌కాలనీకి నిత్యం చెత్త బండిలో చెత్తను వాహనంలో తరలించేలా అవగాహన కల్పించాలని పలువురు కోరుతున్నారు.

సమస్య పరిష్కారానికి సంప్రదించాల్సిన అధికారి:
రమేశ్, పంచాయతీ కార్యదర్శి, ఫోన్ నెంబర్ 98669 64956

వాట్సాప్ చేయండి..

మీ ప్రాంతంలో ఉన్న సమస్యను, దానికి సంబంధించిన ఫొటోను మాకు వాట్సాప్‌లో షేర్ చేయండి. ఆ సమస్య ఎప్పటినుంచి ఉందో రాయండి. వాటిని ప్రచురించి సమస్య పరిష్కారానికి 'సాక్షి' కృషి చేస్తుంది. పంపిన వారి పేరు, ఫొటో ప్రచురిస్తాం.

మా ఫోన్ నంబర్: 9440243048, 9705346626

అభివృద్ధి, వసతుల కల్పనకు కృషి

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా
- రుద్రంగిలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన



రుద్రంగిలో అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా

రుద్రంగి: జిల్లాలో మౌలిక వసతుల కల్పన, అభివృద్ధిపై ప్రత్యేక దృష్టిసారిస్తున్నట్లు ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పేర్కొన్నారు. ఆదివారం మండలకేంద్రంలో పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ.. నియోజకవర్గంలో రుద్రంగిని అన్నిరంగాల్లో అభివృద్ధి చేసేందుకు నిధులు మంజూరు చేస్తున్నామన్నారు. జిల్లాను సీఎం రేవంత్ రెడ్డి, మంత్రుల సహకారంతో అభివృద్ధి పథంలో నిలుపుతామన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షుడు తర్రె మనోహర్, గ్రామశాఖ అధ్యక్షుడు సామ మోహన్ రెడ్డి, డీసీసీ కార్యదర్శులు గడ్డం శ్రీనివాస్ రెడ్డి, తర్రె లింగం, నాయకులు గంగ నర్సయ్య, మల్లయ్య, గండి నారాయణ, ధర్మ మల్లేశం, గంగాధర్, పెద్దఎత్తున నాయకులు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

చివరి గింజవరకు కొంటాం

వేములవాడఅర్బన్: చివరి గింజవరకు ధాన్యం కొనుగోలు చేస్తామని, సన్నరకం ధాన్యానికి క్వింటాల్‌కు రూ.500 బోనస్ చెల్లిస్తామని వేములవాడ ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. మున్సిపల్ పరిధి అనుపురం, సంకెపల్లిలో కొనుగోలు కేంద్రాలను ప్రారంభించి మాట్లాడారు. కొనుగోలులో ఇబ్బందులుంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. సింగిల్‌విండో చైర్మన్లు బీరెడ్డి సల్మాన్ రెడ్డి, రేగులపాటి కృష్ణదేవరావు, డైరెక్టర్లు రామచంద్రరెడ్డి, బొజ్జ భారతి, కాశ శ్రీనివాస్, పోషవేని నాగరాజు, రవీందర్, సత్తయ్య, భాస్కర్, శ్రీనివాస్, ఎర్రం రాజు, చింతపల్లి శ్రీనివాసరావు, రగుడు పర్శరాములు, ప్రదీప్, రాజు, స్వామి, భూమయ్య, తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

చందుర్తి: రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. మండలంలోని సనుగుల, మూడపల్లిలో సింగిల్‌విండో పరిధిలో ఏర్పాటు ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ మాట్లాడుతూ కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. మండలాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేస్తానన్నారు. కేడీసీసీ డైరెక్టర్, సనుగుల సింగిల్‌విండో అధ్యక్షుడు జలగం కిషన్‌రావు, సింగిల్‌విండో అధ్యక్షుడు తిప్పని శ్రీనివాస్, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు చింతపంటి రామస్వామి, వైస్ చైర్మన్ పుల్కం మోహన్, వ్యవసాయాధికారి దుర్గరాజు, సింగిల్‌విండో సీఈవో శ్రీవర్ధన్, డైరెక్టర్లు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు చేయండి

ముస్తాబాద్: ప్రభుత్వం ఎంతో ఆర్భాటంగా ధాన్యం కొనుగోళ్ల కేంద్రాలను ప్రారంభించి చేతులు దులుపుకుందని, వెంటనే ధాన్యం కొనుగోళ్లు చేపట్టాలని మాజీ వైస్ ఎంపీపీ చిట్నేని శ్రీనివాస్‌రావు డిమాండ్ చేశారు. పది రోజుల క్రితం జిల్లా అదనపు కలెక్టర్, అధికారులు కొనుగోలు కేంద్రాలు ప్రారంభించారన్నారు. ఇప్పటివరకు ధాన్యం కొనుగోలు చేయడం లేదన్నారు. ఇప్పటికే రైతులు దళారులకు విక్రయిస్తునట్లు తెలిపారు.

హామీలు అమలుచేయాలి



మాట్లాడుతున్న అరుణ్ కుమార్

వీర్నపల్లి: ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలుచేయాలని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు మల్లారపు అరుణ్ కుమార్ డిమాండ్ చేశారు. మండలకేంద్రంలో ఆదివారం సీపీఎం మహాసభలను జిల్లా కమిటీ సభ్యుడు ఎగుమంటి ఎల్లారెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా అరుణ్ కుమార్ మాట్లాడుతూ.. మండలంలో పేదలు, కార్మికులు ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వం పట్టించుకోవడంలేదన్నారు. మండలంలో ఇల్లు లేని నిరుపేదలకు ఇందిరమ్మ ఇల్లు వర్తింపజేయాలన్నారు. రైతు రుణమాఫీ, రేషన్ కార్డులు, రైతుభరోసా అందించలన్నారు. మండలకేంద్రంలోని వెంకట్రాయిని చెరువులో భూములు కోల్పోయిన రైతులకు నష్ట పరిహారం అందించాలన్నారు. మండలంలో ప్రభుత్వ కార్యాలయాలకు పక్కా భవనాలు, 30 పడకల ఆస్పత్రి నిర్మించాలన్నారు. సీపీఎం శాఖ సభ్యులు, గుంటుకు నరేందర్, భూక్యా వెంకట్, రాజేల్లయ్య, దేవయ్య చంద్రయ్య, జాఫర్, అంజయ్య, మనోజ్, దినకర్ పాల్గొన్నారు.

సన్మానం

గంభీరావుపేట: డీఎస్సీ–2024లో నూతనంగా ఉద్యోగాలు సాధించిన ఉపాధ్యాయులకు ఎల్లారెడ్డిపేట గోపా ఆధ్వర్యంలో ఆదివారం ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. మండల గౌడ సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో నాయకులు రమేశ్ గౌడ్, కార్తీక్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

దేశాభివృద్ధే బీజేపీ లక్ష్యం



సభ్యత్వ నమోదులో పాల్గొన్న వికాస్‌రావు, నేతలు

సిరిసిల్లటౌన్: దేశాభివృద్ధే బీజేపీ ప్రధాన లక్ష్యమని ఆ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇన్‌చార్జి చెన్నమనేని వికాస్‌రావు పేర్కొన్నారు. సిరిసిల్లలో ఆదివారం పార్టీ సభ్యత్వ నమోదు, కార్యకర్తల సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అన్ని వర్గాల అభ్యున్నతికి పారదర్శక పాలన అందించడం ప్రధాని నరేంద్రమోదీకే సాధ్యమన్నారు. పార్టీని బలోపేతం చేయడానికి నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని కోరారు. ప్రతీ ఒక్కరు వారి బూతుల్లో 100 క్రియాశీలక సభ్యత్వాలను నమోదు చేయాలని సూచించారు. బీజేపీ సిరిసిల్ల పట్టణాధ్యక్షుడు నాగుల శ్రీనివాస్, పార్లమెంటు కోకన్వీనర్ ఆడెపు రవీందర్, జిల్లా సభ్యత్వ నమోదు కన్వీనర్ సంతోష్‌రెడ్డి, కొండ నరేశ్, చొప్పదండి అంజన్న, ఊరగొండ రాజు, మోర శ్రీహరి, రమేశ్‌చారి, ఎనగంటి నరేశ్, పంపరి అర్జున్, చొప్పదండి శ్రీనివాస్, తదితరులు పాల్గొన్నారు.